క్లుప్తంగా

నాలుగు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదకూరపాడు(అమరావతి): మండలంలోని 75త్యాళ్ళూరు సబ్‌స్టేషన్ పరిధిలో కాశిపాడు, బలుసుపాడు, కంభంపాడు, పరస గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2.30 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నాలుగు గ్రామాల్లో చెట్ల కొమ్మలు తొలగించనుండటంతో కరెంట్ ఉండదని పేర్కొన్నారు.

ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దడానికి 'ప్రేరణ'

రాజుపాలెం: రాష్ట్రంలో ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దాలనే బలమైన సంకల్పంతో ప్రేరణ కల్పించే తరగతులు నిర్వహిస్తున్నట్లు తెనాలికి చెందిన రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి పాలపర్తి శివ అచ్చియ్య తెలిపారు. నవోదయ ఉన్నత పాఠశాల (ఈఎమ్)లో గురువారం విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆత్మవిశ్వాసం ఎలా పెంపొందించుకోవాలో తెలిపారు. పరీక్షలు రాసే సమయంలో, కాంపిటేటివ్ పరీక్షల యాన్ని ఎలా అధిగమించాలో వివరించారు. చదువుల్లో రాణించి ఉత్తమ విద్యార్థులుగా ఎదిగి సివిల్ సర్వీస్ పరీక్షలకు ఎలా ప్రిపేర్ కావాలో చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ ప్రత్తి రామారావు కోటేశ్వరమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయానికి విరాళంగా కంప్యూటర్లు

పెదకూరపాడు(అమరావతి): స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కంప్యూటర్లు మరమ్మతులకు గురై రెవెన్యూ సేవల్లో జరుగుతున్న జాప్యాన్ని నివారించడానికి టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్ సుమారు లక్ష రూపాయల విలువైన మూడు కంప్యూటర్లు విరాళంగా అందజేశారు. గురువారం టీడీపీ జిల్లా కార్యదర్శి అర్తిమల్ల రమేష్ కంప్యూటర్లను తహసీల్దార్ ధనలక్ష్మికి అందజేశారు. కార్యక్రమంలో పలువురు నేతలు పాల్గొన్నారు.

రాష్ట్ర టెన్నికాయిట్ జట్టులో నకరికల్లు విద్యార్థులు



నకరికల్లు: రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ చాంపియన్‌షిప్ పోటీలకు నకరికల్లు ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు జాలాది శ్రీనివాసరావు తెలిపారు. కోనసీమ జిల్లా మండపేటలో ఈ నెల 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి టెన్నికాయిట్ పోటీలు నిర్వహించనున్నారు. ఈ పోటీలకు ఉమ్మడి గుంటూరు జిల్లా జట్టులో నకరికల్లు ఉన్నత పాఠశాలకు చెందిన బెల్లంకొండ వైశాలి, దేశినేటి కోటేశ్వరరావు ఎంపికైనట్లు ఆయన తెలిపారు. జిల్లా జట్టులో స్థానం పొందిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయునితో పాటు క్రీడా ఉపాధ్యాయురాలు జి.ఝాన్సీరాణి, విద్యాకమిటీ చైర్మన్ కాసా మల్లికార్జునరావు తదితరులు అభినందనలు తెలిపారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు హర్షణీయం



పెదకూరపాడు(అమరావతి): బీమా ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేయడం హర్షణీయమని సత్తెనపల్లి బ్రాంచి ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ మంచాల రమేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని 75త్యాళ్ళూరులో ఏజెంట్స్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బ్రాంచ్ సెక్రటరీ ఈదా శ్రీనివాసరెడ్డి అధ్యక్షత వహించారు. రమేష్ మాట్లాడుతూ ఏజెంట్ల అసోసియేషన్ల పోరాటాలతో ఇన్సూరెన్సు ప్రీమియంపై జీఎస్టీ రద్దు చేశారన్నారు. డివిజన్ ట్రెజరర్ పసుమర్తి జగన్నాథం మాట్లాడుతూ నాయకులు యూనియన్‌ను ఆర్థికంగా బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బ్రాంచి సెక్రటరీ ట్రెజరర్ శంకరరావు, యూనియన్ సభ్యులు కె.విజయశ్రీ,, హైమావతి, డి.కోటేశ్వరరావు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

గెలుపే ధ్యేయంగా కృషి చేయాలి

సత్తెనపల్లి: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపునకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా కృషి చేయాలని ఎమ్మెల్యే కన్నాలక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని తన కార్యాలయంలో గురువారం నిర్వహించిన రాజుపాలెం మండల టీడీపీ విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో టీడీపీ నేతలు దరువూరి నాగేశ్వరరావు, పూజల వెంకట కోటయ్య, మండల, గ్రామ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతన్నా.. జాగ్రత్త!

- వర్షాకాలంలో విద్యుత్ తీగలు, మోటార్లపై అప్రమత్తం
- పొంచి ఉన్న ప్రమాదాలు
- నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాలకే ముప్పు



బెల్లంకొండలోని పొలంలో ఉన్న వ్యవసాయ విద్యుత్ బోరు

బెల్లంకొండ: వర్షాకాలంలో విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇలాంటి సమయంలో మండల రైతులు జాగ్రత్తగా ఉండాలి. బెల్లంకొండ పరిసరాల్లో మూడు రోజులుగా వర్షాలు కురుస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఏ మాత్రం నిర్లక్ష్యంగా ఉన్నా విద్యుదాఘాతానికి గురై గాయాలవడం, ప్రాణాలు కోల్పోవడం ఖాయం. వర్షాలు పడుతున్న సమయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలని సంబంధిత అధికారులు హెచ్చరిస్తున్నారు. ప్రధానంగా రైతులు మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

విద్యుత్ స్తంభాలతో జాగ్రత్త

వర్షాలు పడుతున్న సమయంలో స్తంభాలకు కూడా విద్యుత్ ప్రవహించే అవకాశం ఉంది. వ్యవసాయ బోరు బావులు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభాలను ముట్టుకోకూడదు. ఇళ్లపై నుంచి 11 కేవీ విద్యుత్ వైర్లు ఉంటే వర్షం కురిసే సమయంలో డాబాలపైకి ఎక్కకపోవడమే మంచిది. ఇంటిలో వాడే గృహోపకరణాలు విషయంలో జాగ్రత్తలు పాటించాలి. తడి చేతితో స్విచ్చులు వేస్తే విద్యుత్ షాక్‌కు గురయ్యే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్త తీసుకోవాలి. వర్షాలు కురుస్తున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలి. వాటి సమీపానికి పశువులను మేతకు తీసుకు వెళ్లకుండా సంబంధిత యజమానులు అప్రమత్తంగా వ్యవహరించాలి.

సొంత ప్రయత్నాలు మానాలి

వర్షాలు కురుస్తున్న పడుతున్న సమయంలో ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద మంటలు రావడం, విద్యుత్ వైర్లు తెగిపోవడం వంటి ఘటనలు ఎక్కువగా చోటుచేసుకుంటాయి. కొన్ని సమయాల్లో రైతులు, స్థానికులు వారే మరమ్మతులు చేపట్టి ప్రమాదాలకు గురవుతుంటారు. విద్యుత్ సమస్యలు వచ్చినప్పుడు విధిగా విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వాలి. అలాకాకుండా తెలిసిన మరమ్మతులు చేస్తే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంటుంది. విద్యుత్ వినియోగించడంలో అప్రమత్తంగా లేకపోవడం, సిబ్బందిని సంప్రదించకుండా పొలాల్లో సొంతగా మరమ్మతులు చేస్తే విద్యుత్ ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ఇలాంటి విషాద ఘటనలకు ఆస్కారం లేకుండా జాగ్రత్తలు పాటించాలి.

అధికారులు వెంటనే పరిశీలించాలి

వర్షాకాలంలో వ్యవసాయ బోరు బావుల వద్ద ఉన్న విద్యుత్ లైన్లను గ్రామస్థాయి విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించాలి. సమస్య ఏమైనా ఉంటే వెంటనే బాగు చేయాలి. విద్యుత్ వినియోగం పై రైతులకు సలహాలు సూచనలు అందజేయాలి.

– రుద్రపాటి హుస్సేన్, రైతు, నందిరాజుపాలెం, బెల్లంకొండ మండలం

సమస్యలు ఉంటే తెలియజేయండి

విద్యుత్ సమస్యలు ఏర్పడితే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వాలి. వర్షాలు పడుతున్న సమయంలో విద్యుత్ వినియోగంపై రైతులు అప్రమత్తంగా ఉండాలి. వ్యవసాయ బోర్లు వద్ద ఎటువంటి సమస్యలు ఉన్నా గ్రామస్థాయి విద్యుత్ సిబ్బందికి తెలియజేయాలి.

– పవన్‌కుమార్, విద్యుత్ ఏఈ, బెల్లంకొండ మండలం

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యవంతమైన పంటలు



ప్రకృతి వ్యవసాయం ద్వారి పండించిన కూరగాయలను పరిశీలిస్తున్న జిల్లా ప్రాజెక్టు మేనేజర్

రాజుపాలెం: రసాయనిక ఎరువులు లేకుండా కేవలం ఘన, ద్రవ జీవామృతం, కషాయాలు వాడితే ఆరోగ్యవంతమైన పంటలు పండుతాయని ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. రెడ్డిగూడెంలోప్రకృతి వ్యవసాయ విధానంలో పండించే పంటలను గురువారం పరిశీలించారు. రెడ్డిగూడెంకు చెందిన రైతు నాగేశ్వరరావు, జ్యోతి పొలాల్లో పండించే పంటలను పరిశీలించారు. అమలకుమారి మాట్లాడుతూ వేసవి కాలం నుంచి 30 రకాల విత్తనాలతో పంటల మిశ్రమ పద్ధతి వేసి ఆరు ఎకరాల భూమిలో వంకాయ, గోరుచిక్కుడు, చెట్టుచిక్కుడు, బెండ, మిరప, బీరకాయతోపాటు పండ్లమొక్కలను సాగుచేస్తూ నేరుగా మార్కెట్‌లో విక్రయించడం ద్వారా ఈ కుటుంబం ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ రైతులు, భూ యజమాని గల్లా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పశువుల్లో గర్భకోశ వ్యాధులకు వైద్య శిబిరం



రైతులకు మందులు పంపిణీ చేస్తున్న పశు సంవర్ధక శాఖ అధికారులు

బెల్లంకొండ: మండలంలోని వెంకటాయపాలెంలో గురువారం పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన పశువులకు ఉచిత గర్భకోశ వ్యాధుల పశువైద్య శిబిరాన్ని నిర్వహించారు. దీన్ని రాజుపాలెం ఏడీ జి.వీరయ్య ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పశువుల్లో గర్భ కోశ వ్యాధుల నివారణకు వైద్య సిబ్బంది సలహాలు, సూచనలు పాటించాలని రైతులకు వివరించారు. పాడి వృద్ధి చెందాలంటే దూడలను సంరక్షించుకోవడం ప్రధానమని తెలిపారు. అనంతరం 40 పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స, 30 దూడలకు నట్టల నివారణ మందు పంపిణీ, 20 పశువులకు డి వార్మింగ్ చేశారు. అనంతరం పాడి రైతులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ వైద్యాధికారి రాజ్‌కుమార్, సర్పంచ్ నాగమ్మ భాయి శ్రీను నాయక్, మాజీ సర్పంచ్ మేశం శ్రీరామ్ మూర్తి, సంగం డెయిరీ ప్రెసిడెంట్ అంజలి భాయి పాల్గొన్నారు.

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకోవాలి



బాలింతలకు పౌష్టికాహారం అందిస్తున్న ఆయుష్ డాక్టర్, తదితరులు

రాజుపాలెం: చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం లోపంతో రక్తహీనత వస్తుందని ప్రభుత్వ ఆయుష్ డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు. కోటనెమలిపురిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధులు ఉన్న వారు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. తృణధాన్యాలు, ఆకుకూరలు, పండ్లు ఎక్కువగా తీసుకోవాలని తెలిపారు. అనంతరం పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త నాగమణి, యోగా టీచర్ వెంకటరమణ, తల్లులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు భగవాన్ విశ్వకర్మ చిత్రపటాలు



ఆర్డీవో రమణకాంతరెడ్డికి విశ్వకర్మ చిత్రపటం అందిస్తున్న విశ్వబ్రాహ్మణ సంఘం బాధ్యులు

సత్తెనపల్లి: భగవాన్ విశ్వకర్మ జయంతి ఈ నెల 17న జరగనున్న సందర్భంగా సత్తెనపల్లి నియోజకవర్గ విశ్వబ్రాహ్మణ సంఘం ఆధ్వర్యాన పట్టణంలోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో స్వామి చిత్రపటాలను గురువారం అందజేశారు. పట్టణంలో ఆర్డీఓ జీవీ రమణాకాంతరెడ్డి, డీఎస్పీ మేదరమెట్ల హనుమంతరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.ఆనంద్‌కుమార్, తహసీల్దార్ కాకర్ల శ్రీనివాస చక్రవర్తి, ఇన్‌చార్జి ఎంపీడీఓ టి.శ్రీనివాసరావు కార్యాలయాల్లో చిత్రపటాలను అందజేశారు. నియోజకవర్గంలోని ముప్పాళ్ల, రాజుపాలెం, నకరికల్లు మండలాలలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో విశ్వకర్మ భగవాన్ చిత్రపటాలను అందించనున్నట్లు విశ్వబ్రాహ్మణ నియోజకవర్గ సంఘ అధ్యక్షుడు చింతాడ రమేష్ తెలిపారు. కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ పట్టణ అధ్యక్షుడు కోటగిరి పోతులూరయ్య, కార్యదర్శి దాసు భాస్కరాచారి, నియోజకవర్గ బాధ్యులు కోట నాగరాజు, వేమూలూరి సుబ్బాచారి తదితరులు పాల్గొన్నారు.

సద్ది ఏర్పాటులో దాతల చొరవ అభినందనీయం



గణపవరం అయ్యప్పస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్

నాదెండ్ల: అయ్యప్ప మాలధారులకు సద్ది ఏర్పాటులో దాతల చొరవ, స్వామి పట్ల వారి భక్తి ఎనలేనిదని ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ చెప్పారు. గణపవరం కుప్పగంజివాగు సమీపంలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప స్వామి దేవాలయం సమీపంలో నూతనంగా నిర్మించిన తాత్కాలిక షెడ్డులో ఏర్పాటు చేసిన భిక్ష కార్యక్రమాన్ని గురువారం ఆయన ప్రారంభించారు. మాలధారులకు భిక్షను వడ్డించారు. ముందుగా అయ్యప్పస్వామికి ప్రత్యేక అభిషేకాలు, పూజ ల అనంతరం భిక్ష ఏర్పాటుకు ఆర్థికసాయం అందించిన దాతలు అంబటి రామ్మూర్తి, తోట శివరామకృష్ణ, చేబ్రోలు రామస్వామి దంపతులను శాలు వాలతో సత్కరించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, గురుస్వాములు ఎమ్మెల్సీ రాజశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గురుస్వాములు తులం పూర్ణచంద్రరావు, సిద్ధు హనుమంతరావు, మాదినేని చంద్రమౌళి, చక్రవరం శివన్నారాయణరాజు, మాజీ సర్పంచ్ వలేటి హిమవంతరావు, ఆలయ కమిటీ సభ్యులు మండలనేని శ్రీనివాసరావు, మాజీ ఎంపీటీసీ వెంకటేశ్వర్లు ఉన్నారు.

అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై కేసు

సత్తెనపల్లి: యువతిపై అత్యాచారానికి యత్నించిన వ్యక్తిపై సత్తెనపల్లి రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు .. సత్తెనపల్లి మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన ఓ యువతి 10వ తరగతి పూర్తి చేసి ఇంటి వద్ద ఖాళీగా ఉంటోంది. అదే గ్రామానికి చెందిన చిక్కల మోహన్ అనే వ్యక్తి కొద్ది రోజులుగా ఆమెతో అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. గత నెల 30న ఉదయం 7 గంటల సమయంలో ఆమె ఇంటి సమీపంలో మోటార్ ఆన్ చేసేందుకు వెళ్లింది. అప్పుడు చిక్కల మోహన్ ఆమెను బలవంతంగా చేయి పట్టుకొని నోరు మూసి అరిస్తే కత్తితో చంపేస్తా నంటూ బెదిరించి ఆమెపై అత్యాచారానికి యత్నించాడు. అదే సమయంలో బాధితురాలి తల్లి సంఘటనా స్థలానికి చేరుకోవడంతో మోహన్ పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదుతో చిక్కలమోహన్‌పై సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీనుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

14న ఉచిత వైద్యశిబిరం

శావల్యాపురం: మండలంలోని మతుకుమల్లి గ్రామంలో ఈనెల 14న శ్రీదత్త సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ వారి సారథ్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం సాయంత్రం 4 గంటల నుంచి ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద గ్రామపెద్దల సహకారంతో ఏర్పాటు చేస్తున్నట్లు ప్రముఖ స్టాంప్ రైటరు గ్రామవాసీ మతుకుమల్లి రామకృష్ణ గురువారం తెలిపారు. ఉచిత వైద్యశిబిరంలో వైద్యులు సీనియర్ గుండె నిపుణులు డాక్టరు గార్లపాటి కృష్ణకాంత్, గుండె శస్త్ర చికిత్స వైద్య నిపుణులు డాక్టరు ఎస్.యోగి, ఎముకల నరముల కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ కె.అభిషేక్, జనరల్ వైద్య నిపుణులు డాక్టరు గనిపల్లి సుధాస్రవంతి, అత్యవసర వైద్యనిపుణులు డాక్టర్ డి.రవితేజ వైద్యనిపుణులు పాల్గొంటారన్నారు. ఈశిబిరంలో ఉచితంగా ఈసీజీ బీపీ షుగర్ 2-డి ఏకో వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు ఉచితంగా ఇస్తారన్నారు. మండల ప్రజలు వైద్యశిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మందుబాబుల ఆగడాలు

వినుకొండ: పట్టణంలో మందుబాబుల ఆగడాలు ఎక్కువయ్యాయి. మార్కాపురం రోడ్డులోని చెక్‌పోస్టు వద్ద మందుబాబులు కత్తితో హల్‌చల్ చేసి కొందరిని గాయపరిచిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ నెల 9న అశోక్ అనే వ్యక్తి కత్తితో హల్‌చల్ చేశాడు. అతనితో పాటు అతని సన్నిహితుడు రామకృష్ణ (బచ్చన్) వీరి మీద గతంలో కేసులు ఉన్నట్లు సమాచారం. కత్తితో హల్‌చల్ చేసి సమీపంలో ఉన్న ఇరువురిని గాయపరిచారు. క్షతగాత్రులను ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉంది.

బీసీ ఉద్యోగులు పెన్షనర్స్ మహాసభకు తరలిరండి

నరసరావుపేట: ఈనెల 13న విజయవాడ తమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే బీసీ ఉద్యోగులు పెన్షనర్స్ రాష్ట మహాసభకు ఉద్యోగులు, పెన్షనర్స్ హాజరు కావాలని పల్నాడు జిల్లా బీసీ ఉద్యోగుల జేఏసీ సభ్యులు ఏపీ.మధుకుమార్, బండిరాము, రామారావు, బత్తుల లక్ష్మయ్య, విజయ భాస్కర్, రమేష్ గురువారం ఓ ప్రకటనలో తెలియజేశారు. జనాభాలో 57 శాతం ఉన్న బీసీలు ఆర్థికంగా, సామాజికం, రాజకీయంగా వెనుకబడి ఉన్నారని. దీనికి ప్రధాన కారణం ఐక్యత చైతన్యం లేకపోవడమే అన్నారు. దీనివలన బీసీలు అనేక ప్రయోజనాలు కోల్పోతున్నారని, ఇటువంటి సభలకు హాజరవడం ద్వారా మన ప్రయోజనాలు కాపాడబడతాయని తెలియజేశారు. ఈసభ ద్వారా బీపీ మండల్ సిఫార్సు అమలు చేయాలని, బీసీలకు రక్షణ చట్టం, క్రిమిలేయర్ రద్దు చేయాలనే డిమాండ్లు ప్రభుత్వానికి చేయటం జరుగుతుందన్నారు. ఈసభకు హాజరయ్యే వారు 83284 14008, 94915 03406 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ఎరువుల వాడకంపై అవగాహన



గుడిపూడిలో ఎరువుల వినియోగంపై సూచనలు చేస్తున్న ఏవో సుబ్బారెడ్డి

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం, ముప్పాళ్ల గ్రామాల్లోని రైతులకు యూరియా వాడకంపై గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. మండల వ్యవసాయాధికారి ఎస్.శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలో సరిపడా యూరియా అందుబాటులో ఉందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. రైతులు యూరియా వాడకాన్ని తగ్గించుకొని, నానో యూరియాపై దృష్టి సారించాలన్నారు. ఆయా గ్రామాల పరిధిలో సాగు చేసిన పంటల వివరాలపై జాబితా తయారు చేసి నివేదిక అందివ్వాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ శేషుబాబు, సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సత్తెనపల్లి: అందరికీ ఎరువులు అందుబాటులో ఉంచుతామని సత్తెనపల్లి మండల వ్యవసాయ శాఖ అధికారి బి.సుబ్బారెడ్డి అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడిలో గురువారం ఎరువుల వినియోగం పై రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డి మాట్లాడుతూ రైతులు అవసరం మేరకే యూరియా కొనుగోలు చేయాలన్నారు. నానో యూరియా ఉపయోగిస్తే వాతావరణ కాలుష్యం, నీటి కాలుష్యం తగ్గుతుందన్నారు. అనంతరం పంటపొలాల్లో ఎరువు వినియోగం పై క్షేత్ర స్థాయిలో పరిశీలించి సూచనలు చేశారు. కార్యక్రమంలో గ్రామస్థాయి అవుట్ రీచ్ బృందం, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిస్టు యోధుడు ఏచూరికి నివాళి



ఏచూరి చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న సీపీఎం నాయకులు, ప్రజాసంఘాల సభ్యులు

అమరావతి: కమ్యూనిస్టు ఉద్యమ నేత కామ్రేడ్ ఏచూరి సీతారాం మృతి భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమానికి తీరని లోటని సీపీఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు జి.రవిబాబు అన్నారు. గురువారం సీపీఎం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థి ఉద్యమ నేతగా, కార్మిక, రైతాంగ, ఉద్యోగ, దళిత, గిరిజన, మైనార్టీ వర్గాల సమస్యల పైన పార్లమెంట్‌లో ప్రస్తావించి పరిష్కరించిన గొప్ప పేదల పక్షపాతి అని కొనియాడారు. పార్టీ మండల కార్యదర్శి బి.సూరిబాబు మాట్లాడుతూ మార్కిస్ట్ మేధావి ఆర్థిక తత్వవేత్త సీతారాం ఏచూరి మృతి భారత ప్రజానీకానికి, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటన్నారు. తొలుత ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో నండూరి వెంకటేశ్వరరాజు, మొహిద్దీన్ వలి, తోకల సూరిబాబు, మధు, తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాల్లో సీతారాం ఏచూరి పాత్ర మరువలేనిది

సత్తెనపల్లి: దేశ రాజకీయాల్లో కామ్రేడ్ సీతారాం ఏచూరి పాత్ర మర్చిపోలేనిదని సీపీఎం జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ అన్నారు. సీపీఎం సత్తెనపల్లి పట్టణ కమిటీ ఆధ్వర్యాన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సీతారాం ఏచూరి ప్రతమ వర్ధంతి సభ గురువారం జరిగింది. సీపీఎం పట్టణ కార్యదర్శి కామ్రేడ్ ధరణికోట విమల అధ్యక్షత వహించారు. విజయకుమార్ మాట్లాడుతూ నిర్దిష్ట పరిస్థితులకు మార్క్సిజం అన్వయించడంలోనూ ఎనలేని కృషి చేశారన్నారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గద్దె చలమయ్య మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను బలవంతంగా అమలు చేస్తే ఏ ప్రభుత్వం మనుగడ సాగించలేదన్నారు. కార్యక్రమంలో న్నమనేని పాములయ్య, పట్టణ కమిటీ సభ్యులు అనుముల వీరబ్రహ్మం, ఎం.జ్యోతి, పెండ్యాల మహేష్ బాబు, ఎం హరిపోతురాజు తదితరులు పాల్గొన్నారు.

భూస్వాములపై పోరాటం సాగించిన ఐలమ్మ



సత్తెనపల్లిలో ఐలమ్మ విగ్రహనికి నివాళులర్పిస్తున్న రజక సంఘ యూత్ బాధ్యులు

సత్తెనపల్లి: తెలంగాణ సాయుధ పోరాటంలో పేద రైతులకు అండగా నిలబడి భూస్వాములపై పోరాటం సాగించిన చిట్యాల ఐలమ్మ ఆదర్శప్రాయురాలని రజక సంఘం యూత్ బాధ్యులు అన్నారు. పట్టణంలోని దోబీ ఘాట్‌లో తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ నాయకురాలు చిట్యాల ఐలమ్మ వర్ధంతిని గురువారం నిర్వహించారు. ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రజక సంఘ యూత్ బాధ్యులు మాట్లాడుతూ తెలంగాణలో భూస్వాములపై సాగించిన సాయుధ పోరాటంలో నాలుగువేల మంది వరకు అమరులయ్యారన్నారు. వారి త్యాగ ఫలితంగా 10 లక్షల ఎకరాలు పేద రైతులకు పంచిపెట్టారన్నారు. ఈ సందర్భంగా ఐలమ్మ పోరాట పటిమను కొనియాడారు. కార్యక్రమంలో రజక సంఘ యూత్ బాధ్యులు, తదితరులు ఉన్నారు.

వేర్వేరు ఆటల పోటీలకు ఎంపికైన క్రీడాకారులు



వాగ్దేవి విద్యార్థులను అభినందిస్తున్న ప్రతినిధులు



కే-రిడ్జి విద్యార్థినులను అభినందిస్తున్న నాతాని

నరసరావుపేట ఈస్ట్: ఫ్లోర్‌బాల్ జాతీయ జట్టుకు కే-రిడ్జి విద్యార్థిని జాతీయస్థాయి ఫ్లోర్‌బాల్ పోటీలలో కే-రిడ్జి విద్యార్థులు ప్రాతినిథ్యం వహించిన ఆంధ్రప్రదేశ్ జట్టు తృతీయ స్థానం సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపల్ జి.బర్నబాస్ గురువారం తెలిపారు. బీహార్ రాష్ట్రంలోని ముజాఫర్‌పుర్‌లో నిర్వహించిన జాతీయస్థాయి అండర్-14 బాలిక విభాగంలో ఏపీ జట్టు తృతీయస్థానం సాధించిందని వివరించారు. ఏపీ జట్టుకు తమ విద్యార్థిని ఎన్.హంసిని కెప్టెన్‌గా వ్యవహరించగా, బి.యశస్విని, ఎస్.లీల లోహిత గెలుపులో కీలకపాత్ర పోషించారని తెలిపారు. కాగా, ఫ్లోర్‌బాల్ జాతీయ జట్టుకు తమ విద్యార్థిని లీలా లోహిత ఎంపికైందని, త్వరలో సింగపూర్‌లో జరగనున్న అంతర్జాతీయ ఫోర్‌బాల్ అండర్-14 బాలికల పోటీలో పాల్గొంటుందని తెలిపారు. విద్యార్థులను పాఠశాల చైర్మన్ నాతాని వెంకటేశ్వర్లు, డైరెక్టర్ కోమటినేని నాసరయ్య, ప్రిన్సిపల్ బర్నబాస్, వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.కిషోర్‌బాబు, పి.మహిత, శేషగిరి అభినందించారు.

ఆట్యా-పాట్యా జట్టుకు వాగ్దేవి విద్యార్థులు

పల్నాడు జిల్లా ఆట్యా-పాట్యా బాలబాలికల జట్టుకు వాగ్దేవి జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపల్ ఓగూరి నాగేశ్వరరావు గురువారం తెలిపారు. నకరికల్లు జడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎంపిక పోటీలో బాలికల విభాగంలో బి.సౌజన్య, షేక్.నజ్మా, పి.తిరుపతమ్మ, కె.లక్ష్మీసరిత, పి.స్రవంతి, బాలుర విభాగంలో కె.శ్రీనివాసరావు, కె.తినాథ్ ఎంపికయ్యారని వివరించారు. విద్యార్థులను కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, డైరెక్టర్ కాట్ల రామకోటేశ్వరరావు, కపలవాయి రాజేంద్రప్రసాదు, అభినందించారు.

15 నుంచి ఉచిత యోగ శిక్షణ శిబిరం

నరసరావుపేట ఈస్ట్: శ్రీవెంకటేశ్వర యోగ సేవాకేంద్రం నరసరావుపేట శాఖ ఆధ్వర్యంలో ఈనెల 15వతేదీ సోమవారం నుంచి 28 రోజుల పాటు 189వ ఉచిత యోగ శిక్షణ శిబిరం నిర్వహిస్తున్నట్టు శాఖ నిర్వాహకుడు కూనిశెట్టి వెంకట జనార్దన్ గురువారం తెలిపారు. ప్రతిరోజు ఉదయం 5 నుంచి 7గంటల వరకు శ్రీపట్టాభిరామస్వామి ఆలయంలోని వేంకటేశ్వర కల్యాణ మండపంలో శిబిరం కొనసాగుతుందని వివరించారు. శిబిరంలో 42 యోగ భంగిమలు, ప్రాణాయామం, ధ్యానం, ఆహార నియమాలు, సూర్య నమస్కారాలు బోధిస్తామన్నారు. వివరాలకు కన్వీనర్ కూనిశెట్టి అనూరాధ 9491665733, 9490846333 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.